యుగంధర్ కూడా ఆలోచనలో పడ్డాడు. మరలా నిశ్శబ్దం పేరుకుంది. క్షణాలు... నిమిషాలు గడిచిపోతున్నాయ్. అంతలో ఫోన్ మోగింది. యుగంధర్ చటుక్కున ఫోనెత్తాడు "హలో! యుగంధర్ దిస్ సైడ్!"

"హలో యంగ్‌మేన్ ! నేనూ గంగాధరరావుని మాట్లాడుతున్నాను..."

"నమస్కారం సార్!" అని ఫోన్‌లో చెప్పి మౌత్‌పీస్ మీద కుడి చేతిని అడ్డం పెట్టి సర్కిల్ వేపు చూస్తూ "సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ గంగాధరరావు గారు"
అని అప్పుడు చేతిని తొలగించి "చెప్పండి సార్" అన్నాడు వినయంగా యుగంధర్.

"ఏం లేదు. నువ్వు, నాన్నగారెలా వున్నారో తెలుసుకుందామని చేశాను. నా ఉద్యోగం తెలుసుగా నరరూప రాక్షసుల్లాంటి ఖైదీలపై అనుక్షణం కంటికి రెప్పలా నిఘా వేసి వుంచాలి. బైదిబై నువ్వు, నాన్నగారు పోయిన సండే మా ఇంటికి భోజనానికి వస్తానని చెప్పి రాలేదు. నేనయితే నీ బిజీని అర్థంచేసుకోగలను. కాని నా ముద్దుల కూతురు, నీ ఫ్రెండ్ అదే బ్రాహ్మణి గొడవ చేసింది. మరలా మీరు భోజనానికి వచ్చేవరకు నన్ను హింసించేదే, నా అదృష్టం బావుండి ఓ ఖైదీ మనస్తత్వ పరిశీలనంటూ దానిలో మునిగిపోవటంతో నేను బతికిపోయాను. అలాంటి పనులు వద్దమ్మా అంటే వినదు కదా? అతనసలే పదేళ్ళ వయసులోనే మర్డర్ చేసిన మోస్ట్ ఇంటెలిజెంట్ అండ్ డేంజరస్ గై. ఈలోపే అతను రిలీజ్ అయ్యాడు. దాంతో నేనా వూరు వెళతానని అతని వూరు వెళ్ళి 'ఆఫ్టర్ జైల్' అన్న అంశంమీద రీసెర్చ్ చేస్తుందట" ఆ వేపు గంగాధరరావు అన్న మాటల్ని మననం చేసుకున్నాడు యుగంధర్.

"అంకుల్. జస్ట్ ఫర్ ఇన్‌ఫర్మేషన్. ఆ ఖైదీ ఎవరు? ఏ వూరు? " ఆసక్తిగా ప్రశ్నించాడు యుగంధర్.

"అతని పేరు ఉదయ్" ఊరు పేరు కూడా చెప్పాడు ఆ వేపునుంచి గంగాధరరావు.

"సరే అంకుల్. వచ్చే వారం తప్పనిసరిగా బ్రాహ్మణి చేతి వంటకాన్ని రుచిచూసేందుకు డాడీ, నేను ధైర్యంగా వస్తున్నామని చెప్పండి, వుంటాను మరి బై" యుగంధర్ ఫోన్ క్రెడిల్ చేసి సర్కిల్ వేపు చూశాడు సాలోచనగా.

"ఓ పరిష్కారం దొరికింది మిస్టర్ సర్కిల్"

"చెప్పండి సార్...." వినయంగా అడిగాడు సర్కిల్.

"నేనో అడ్రస్ ఇస్తాను, అక్కడకువెళ్ళి రహస్యంగా ఉదయ్ అనే యువకుడ్ని పట్టుకో. ఆతను మన పనికిరావచ్చనే నమ్మకం నాకుంది. అయితే ఇదంతా రెండు
రోజుల్లో జరిగిపోవాలి. ఇకపోతే ఇప్పుడు నువ్వెళ్ళబోయే పట్టణం, నేను త్వరలో పోస్టింగ్ కావాలనుకున్న పట్టణం ఒక్కటే. అందుకే చెబుతున్నాను నువ్వు సర్కిల్‌లాగ, పోలీస్ మనిషిలా వెళ్ళకూడదు. ఒక సివిలియన్‌లా వెళ్ళాలి. స్టేషన్‌కి వెళ్ళనక్కరలేదు. నువ్వు ఇంటివద్దనుంచి లీవ్‌లెటర్ పంపించు. నేను ఆఫీసుకు వెళుతూనే లీవ్ శాంక్షన్ చేస్తాను. ఈ విషయం మూడోమనిషికి తెలియకూడదు, దానివలన నా పథకం మొత్తమే బెడిసికొట్టవచ్చు. ఓ.కె."

"ఓ.కె సార్. కాని ఆ ఉదయ్ అనే అతను మనం చెప్పిన పనికి ఒప్పుకుంటాడనే నమ్మకం..." సర్కిల్ వివరాలలోకి వెళుతున్నాడు.

"అక్కడే కదా మనం తెలివితేటల్ని నిరూపించుకోవాల్సింది"

"ఓకె సార్. నేనీరోజే అక్కడకు వెళ్తాను. ఎలాగోలా అతన్ని వప్పిస్తాను. ఈలోపు మీఏర్పాట్లలో మీరుండండి."

సర్కిల్ సెల్యూట్ చేసి వెనక్కి ఓ అడుగువేసి గిరుక్కున వెనుతిరిగి బయటకు దూసుకుపోయాడు.

0 0 0 0 0 0

ఉష రాసిచ్చిన ఫాలో అప్ న్యూస్ చూసి రెసిడెంట్ ఎడిటర్ ఒకింత ఆశ్చర్యపోయాడు. ఏమిటి నీ సాహసం అన్నట్లు కూడా చూశాడు...

"ఈ వృత్తిలోకి అడుగిడినప్పుడే నేను భయాన్ని అటకెక్కించాను సార్. ఆ బాస్టర్డ్స్‌కి నేను భయపడేది లేదు. ఇంతకుముందే కొందరు మనుష్యుల నుంచి ప్రమాదం వుందనే కంప్లయింట్ స్టేషన్‌లో లాడ్జి చేసి వచ్చాను" ఆవేశంగా మాట్లాడుతున్న ఉషవేపు విస్తుపోయి చూస్తూ మరోసారి ఆమె రాసిఇచ్చిన ఫాలోఅప్ రిపోర్ట్ వేపు చూశాడు రెసిడెంట్ ఎడిటర్.

ఏకసభ్య నిర్వహణలో వున్న చిట్‌ఫండ్ కంపెనీల్లో చేరకండి అనే హెడ్‌లైన్ క్రింద వార్త ఇలావుంది. ఒకే వ్యక్తి మేనేజ్‌మెంట్‌లో వుల్ల చిట్‌ఫండ్ కంపెనీలలో చేరటం ప్రమాదకరం. చట్టప్రకారం కొంతమంది డైరెక్టర్స్ ఈ కంపెనీకి వుంటారు. కాని వారి ఇన్‌ఫ్లుయెన్స్ నిర్వాహకుని మీద ఏమాత్రం వుండదు. కంపెనీ వ్యవహారాల్లో వారు డైరెక్ట్‌గా భాగస్వాములు కాలేరు. డైరెక్టర్స్‌ని పట్టుకుని నిలదీసినా ప్రయోజనం ఎంతమాత్రం వుండదు. ఆ తరహా కంపెనీయే శ్రీమతి సుందరమ్మది. ఈ సుందరమ్మ గతంలోకూడా కొన్ని ఊర్లలో, కొన్ని చోట్ల నమ్మకంగా కొన్నాళ్ళు వుండి చుట్టుపక్కల వాళ్ళకు అప్పులు యిస్తూ తన పరపతిని పెంచుకుంది.

డబ్బు అవసరం లేని మధ్యతరగతి మానవుడెవడు? ఆ వీక్ పాయింట్‌ని పట్టుకున్న సుందరమ్మ తన దగ్గరకు అప్పుకొచ్చే గృహిణుల్ని సాదరంగా రిసీవ్ చేసుకుని ఎన్నాళ్ళిలా అప్పులు చేస్తారు? నాకు వడ్డీలు కడతారు? మిమ్మల్ని చూస్తుంటే బాధగావుంది. అందుకే వాళ్ళు వళ్ళంతా చెవులు చేసుకుని ఆమె వేపు ఓ ప్రవక్తను చూసినట్లు చూస్తారు. అప్పుడామె పాతికమంది డబ్బులు అవసరవున్న వాళ్ళు నా దగ్గరకు వస్తే చిట్ వ్యాపారం ప్రారంభిద్దాం, మీరు పాతికమంది తలా వంద నెలఫస్ట్‌కి చెల్లించారనుకోండి. ఆ నెల్లో రెండవ ఆదివారంనాడు నా ఇంట్లో ఒక సమావేశం ఏర్పాటుచేస్తాను. అప్పుడు నా దగ్గర 2,500 వున్నట్లు అదంతా మీదే. అప్పుడు పాట పెడతాను.

ఎవరయితే ఎక్కువ వదులుకునేందుకు సిద్ధపడతారో వారికే ఆ డబ్బు వస్తుంది. దాన్నే డిస్కౌంట్ అంటారు. చీటిపాడి డబ్బు తీసుకోవటానికి చీటిదారు వదులుకోడానికి సిద్దపడే

డబ్బు దాన్ని మరలా సభ్యులందరికీ లాభంగా పంచుతాను. ఇందులో నాదేంలేదు. నాకేం వద్దు కూడా. మీ డబ్బుతో మీ అవసరాల్ని తీర్చుకోవచ్చు. మీరు నెలకు వంద ఏ ఖర్చు కైనా వెచ్చించగలరు. ఆ ఖర్చు ఏ పదిహేనువందలో రెండువేలో వుందనుకోండి అప్పుడు ఎలా? అందుకే ఈ చిట్టీ వ్యాపారం. ఇరవై ఐదుమంది సామర్థ్యాల్తో ఓచోట చేరి ఒకరి కష్టాన్ని మిగతావాళ్ళు పంచుకోవటం అన్నమాట. ఒకరి అవసరాన్ని అందరూ తమ తమ చిరుమొత్తాలతో పరిష్కరించుకోవటం అన్నమాట. ఎవరో వస్తారని ఏదో చేస్తారని పడిగాపులు పడిగాని ప్రయోజనం లేదు. సంఘటిత శక్తితో మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలి అని ఉద్భోదిస్తుంది. అందులో వారికి దగా మోసం ఏమీ కనిపించవు. అందుకే వెంటనే చీటీదారులుగా చేరేందుకు అంగీకరిస్తారు.

ఈ వ్యాపారం చేసేది సుందరమ్మ అని ఎక్కడా డాక్యుమెంట్స్ వుండవు. చట్టంముందు నిలిచే ఏ ఆధారమూ వుండదు. అలా 25మందితో ప్రారంభించి నిజాయితీగానే చీటీని నడుపుతుంది. ఒకనెల చీటీ చందా సభ్యులంతా ఫస్టుతారీఖున సుందరమ్మకిస్తారు. ఆ సాయంత్రమే సుందరమ్మ రెండువేల ఐదొందల్ని నెలకు నూటికి పదిరూపాయల వడ్డీకి తన దగ్గర సభ్యులు కానివారికిస్తుంది.

అంటే రెండో తారీకున సుందరమ్మ దగ్గర చీటిడబ్బు అణాపైసా కూడా లేదన్నమాట. 25 మంది సభ్యులు ఆశగా రెండవ ఆదివారం కోసం ఎదురుచూస్తూ వుంటారు. అది కాస్తా రానే వస్తుంది. ఎవరో 30 శాతం వదులుకునైనా చీటీ పాడుకుంటారు. అంటే పాటదారుడికి కొన్ని నెలలపాటు కట్టవలసి వుంటుంది. అదలా వుంచితే వచ్చే సొమ్ము కేవలం 1,750 అంటే 750 రూపాయలు తిరిగి సుందరమ్మవద్దే కొన్ని నెలలపాటు వుంటుంది. ఈ పాడుకున్న వ్యక్తికి 1,750 ఇవ్వడానికి గ్యారంటీ అడుగుతుంది. అతను అటుతిరిగి ఇటు తిరిగి ఒక వారంలో గ్యారంటీ తెస్తాడు. అప్పటికి మూడు వారాలవుతుంది. సభ్యులకు చీటీడబ్బు చెల్లించి పాటదారుకి 1,750 ఇవ్వాలి. కాని సుందరమ్మ దగ్గర లేవు. అవి ఇంతకుముందే వడ్డీకి తిరుగుతున్నాయి. అందుకని నెలలో చివరివారం సుందరమ్మ ఏదో అర్జంట్ పని వుందంటూ వూరికి వెళ్తుంది. తిరిగి సరిగ్గా రెండో నెల మొదటిరోజున వస్తుంది. రాగానే తను వడ్డీకిచ్చిన వ్యక్తి నుంచి అసలు 2,500తో పాటు వడ్డీ 250 వసూలు చేస్తుంది. అంటే ఇప్పుడు సుందరమ్మ దగ్గరున్న సొమ్ము 2,750. అప్పుడు మొదటి నెల చీటి పాడిన వ్యక్తి తన దగ్గరకు రాగానే రెండోనెల పేమెంట్ వంద బిగబట్టుకుని 1,650 ఇస్తుంది. అప్పటికి ఆమె దగ్గరున్న సొమ్ము 1,100. నెలవారీ చెల్లించే సభ్యుల చందా ఆ రోజే వస్తుంది. అది 2,500. మొత్తం ఇప్పుడు సుందరమ్మ దగ్గరున్న సభ్యులసొమ్ము 3,600. దానికితోడు ఆమెకి వచ్చిన వడ్డీసొమ్ము 250 వెరసి 3,850.ఇది మరలా రెండోనెల రెండోతారీకునే పదిరూపాయల వడ్డీకిస్తుంది.

అలా 25 నెలలు పూర్తయ్యేసరికి సుందరమ్మ కేవలం సభ్యుల డబ్బును ఆ డబ్బుమీద వడ్డీని కలిపి వడ్డీకిస్తూ ఎంత సంపాదించి వుంటుంది.

ఇక్కడ 25 మంది సభ్యులెవరికీ ప్రతినెలా తాము వదులుకుంటున్న 30 శాతం డిస్కౌంట్ ఏమవుతుందన్న స్పృహ లేకపోవటం విచారకరమయిన విషయం. అయితే ఓసారి ఒక వూళ్ళో ఒకింత తెలివి తేటలున్న గృహిణి అదే విషయాన్ని సుందరమ్మను అడిగింది. అప్పుడు సుందరమ్మ ఇచ్చిన సమాధానం విని నోరు మూసుకోవడం జరిగింది.

నెలకు వంద చొప్పున 25 నెల్లపాటు చెల్లిస్తే అది 2,500 అవుతుంది. అయితే ముందే 1,750 రూపాయలు తీసుకుంటున్నారు కదా. ఈ 2,750కి పదిరూపాయల వడ్డీ చొప్పున నెలకు 175 అవుతుంది. 25 నెలలకు 4,375 అవుతుంది. ఇప్పుడు జరుగుతున్న పద్ధతిలో 1,750కి 25 నెల్లకి కేవలం 750 మాత్రమే కదా వదులుకునేది. అదీకాక చీటి పద్ధతిలో 25 నెలలు పూర్తయ్యాక మరేం చెల్లించక్కర్లేదు కదా అని సుందరమ్మ ఇచ్చిన వివరణ వాళ్ళ నోళ్ళు మూయించింది. పైగా చివరలో డిస్కౌంట్ పంచనని ఎవరన్నారని కూడా అంటుంది.

ఇది సుందరమ్మ వ్యాపార సరళి. ఇలా ఒక చీటి అయిపోవటానికి 25 నెలలు పడుతుంది. అయితే ఈలోపే సుందరమ్మ మరో చీటి ప్రవేశపెట్టి ఈ సారి వందమంది సభ్యులు నెలకు పదివేలు చందాగా చీటీ ప్రారంభిస్తుంది. ఈ వందమంది సభ్యులు నెలకి పదివేలు చందాగా చెల్లిస్తుంటారు. సరిగ్గా మొదటి చీటీ అయిపోయే ముందు నెలకి రెండోచీటి సగానికి వస్తుంది. ఇకప్పుడు మంచి ముహూర్తం నిశ్చయించుకుని సభ్యులెవరికీ అనుమానం రాని రీతిలో ముఖ్యమయిన ఇంటి పరికరాల్ని, వస్తువుల్ని ఊరు దాటించేస్తుంది. వడ్డీకిచ్చిన డబ్బు చీటీ చందాలు పాడుకున్న ఇద్దరు సభ్యులకి చీటీ డబ్బుకూడా ఇవ్వవల్సి వస్తుంది. ఈ ఇవ్వవల్సి రావటాన్ని తన అదృశ్యంతో తప్పించుకుంటుంది.

ఇలా ఈమె అప్పటికే కొన్ని వేలమందిని ముంచినట్లు తెలుస్తోంది. ఈమె చాలా తెలివి కలది. ఈమె ఎప్పుడూ పెద్ద పల్లెటూర్లనే తన కేంద్రాలుగా ఎన్నుకుంటుంది. అదీ నిరక్షరాస్యత ఎక్కువగావున్న ఊరినే ఎన్నుకుంటుంది కనుక పాఠకులంతా తమ ప్రక్కవాళ్ళను కూడా ఎడ్యుకేట్ చేస్తూ అమాయక ప్రజలిలాంటి మోసాలకు గురికాకుండా చూడగలరు. ఇమె ఫోటోకోసం ప్రయత్నించడం జరుగుతోంది. అది దొరకగానే పేపర్‌లో ప్రచురిస్తాం.

కొసమెరుపు : ఈ వార్త రాసిన జర్నలిస్టు ఉష తల్లిదండ్రుల్ని సుందరం మనుష్యులు బెదిరించటం జరిగింది. సుందరం నిజాయితీపరురాలే అని, ఇదే పేపర్‌లో ఇదేచోట ప్రచురించకపోతే ఉషను చంపుతామని కూడా బెదిరించటం జరిగింది. దీన్నిబట్టి పెద్ద మనుష్యుల ముసుగులో వున్న కొందరు వ్యక్తులు ఈమెకు అండగా వున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి బెదిరింపులకు భయపడక సుందరమ్మ మోసాల్ని, ఆమె వెనుక వున్న వ్యక్తుల బండారాన్ని బయటకు లాగే ప్రయత్నంలో ఉష మరో ముందడుగు వేయబోతున్నదని పాఠకలోకానికి సవినియంగా మనవి చేస్తున్నాం---రెసిడెంట్ ఎడిటర్.

ఉష న్యూస్ స్టోరీని పూర్తిగా చదివిన రెసిడెంట్ ఎడిటర్ ఓసారి ఇబ్బందిగా కదిలి సిగరెట్ వెలిగించుకుని తిరిగి ఉషవేపు చూశాడు. ఆ వార్తలో నీతి, నిజాయితి వుందని,

దాని వలన ఎందరో అమాయక మధ్య తరగతి జీవులకు మేలు జరుగుతుందని ముఖ్యంగా ఆ న్యూస్‌స్టోరీ సెన్సేషన్ అవుతుందని కూడా ఆయనకు తెలుసు.

వీటన్నిటిని మి ంచి ఆ న్యూస్‌స్టోరీ వెనుక ఉష పరిశోధన ఎంతో వుందనికూడా ఆయనకు తెలుసు, అది ప్రచురించటం మూలంగా పేపర్‌కి, తనకు, ఉషకి ఎంతో మంచిపేరు వస్తుంది అని కూడా తెలుసు. కాని... తరువాత ఉష... ఉషకేదన్నా జరిగితే? సుందరమ్మ మనుష్యుల ద్వారా జరిగితే...

బ్రతుకుతో రాజీపడి రాజీ వార్తలు మాత్రమే రాయటం ఆయనకి చాలా బాధగా వుంది. అలా అని ఉషను ఇబ్బందుల పాలు చెయ్యటంకంటే చైర్‌మెన్ దృష్టికి తీసుకువచ్చి వారి సలహా తీసుకొవటం ఎందుకయినా మంచిదనిపిందాయనకు. అందుకె అప్పటికప్పుడు ఆయన ఆ వార్తను ప్రచురించే విషయంలో ఒకరోజు గడువు తీసుకోవాలనుకున్నాడు. ఆఖరి పేరాను ఎడిట్ చేసి రైట్‌సైడ్ ట్రేలో పెడుతూ.

ఈ వార్తను ప్రచురించేముందు చీఫ్ ఎడిటర్‌గారి అనుమతి తీసుకోవటం ఎందుకయినా మంచిది. నేను వారితో మాట్లాడుతాను. నువ్వు జాగ్రత్తగా వుండు ఉష..."
అన్నాడు ఇంకామెను వెళ్ళి రమ్మన్న భావాన్ని వ్య క్తం చేస్తూ.

ఆమె నిస్పృహగా రెసిడెంట్ ఎడిటర్ గదిలోంచి బయటకువచ్చింది. ఆమెలోని ఉత్సాహం, ఆవేశం, నిజాయితీ, ఆదర్శం, తపన ఒక్కసారి నీరుగారిపోయాయి.

0 0 0

సాయంత్రం వరకూ తిరిగినా తన ఇంటి అడ్రస్ పట్టుకోలేకపోయాడు ఉదయ్.

అదే టైమ్‌కి సర్కిల్ ఆ పట్టణంలో అడుగుపెట్టాడు. పిచ్చెక్కినవాడిలా తిరుగుతున్నాడు సర్కిల్. సరిగ్గా ఉష పత్రికాఫీసు నుంచి బయటకొచ్చి ఆటో ఎక్కటం, సుందరమ్మ మనుష్యులు చూడటం... ఆమెను ఫాలో కావటం - అంతా క్షణాల్లోపే జరిగిపోయింది.
కొంతదూరం వెళ్ళేసరికి ఉష తనను ఎవరో వెంటాడుతున్నట్లు పసిగట్టింది. ఆటోని ఇష్టమొచ్చిన సందులగుండా తిప్పమని చెప్పి మధ్య మధ్యలో వెనక్కి తిరిగి చూస్తోంది.

అలా గంటసేపు జరిగిన ఛేజింగ్‌తో ఉషకి చిరాకు వచ్చేసింది, ఇక లాభం లేదని రోడ్డువారగా కనిపిస్తున్న టీ బంక్ దగ్గర ఆటోని ఆపమంది.
ఆటోకి డబ్బులిచ్చి ఉష టీ బంక్‌లోకి వచ్చేసింది. సరిగ్గా అదే టైంకి సర్కిల్‌కి అలుపొచ్చి అదే టీ బంక్‌లోకి వచ్చాడు. ఇప్పుడక్కడ ఉదయ్, సర్కిల్, ఉష ముగ్గురూ వున్నారు.